సాక్షి కామారెడ్డి

గురువారం । 14 । ఆగస్టు । 2025



అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సబ్‌కలెక్టర్ కిరణ్మయి సూచించారు.

- 9లో ▸



భూమిపూజకే పరిమితం

బీబీపేటలో బాలికల ఉన్నత పాఠశాల భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి మూడేళ్లవుతున్నా పనులు ప్రారంభం కాలేదు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.7 /22.2

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

స్వాతంత్ర్య దినోత్సవాల అతిథిగా కోదండరెడ్డి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవాలకు ముఖ్య అతిథిగా తెలంగాణ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి రానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కోదండరెడ్డి 15న జిల్లా కేంద్రంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసులనుంచి గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. అనంతరం జరిగే సమావేశంలో జిల్లా ప్రగతిపై ప్రసంగిస్తారు. కామారెడ్డికి చెందిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఆదిలాబాద్ జిల్లాకు అతిథిగా వెళ్తున్నారు.

పీజీ ఫలితాలు విడుదల



కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. తెలంగాణ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి కే.సంపత్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ కే.కిష్టయ్య ఫలితాలను విడుదల చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

పోచారం ప్రాజెక్టు పరిశీలన



నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టులో నీటిమట్టాన్ని బుధవారం ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. రెండు, మూడు రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రాజెక్టులోని నీటి అంచుకు ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఈ అక్షయ్‌కుమార్‌కు సూచించారు. ఆయన వెంట ఏఈతోపాటు వర్క్ఇన్‌స్పెక్టర్ యాదగిరి ఉన్నారు.

'నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం'



బీబీపేట: జిల్లాలో నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఇస్సానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సబ్‌స్టేషన్‌లో గ్రామంలో విద్యుత్ సరఫరాకు ఒక బ్రేకర్, వ్యవసాయ కనెక్షన్‌లకు మరొకటి ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీని వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఉంటుందన్నారు. ఎవరూ సొంతంగా మరమ్మతులు చేయరాదని, ఏదైనా సమస్య ఉంటే విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ కల్యాణ్ చక్రవర్తి, ఏడీఈ సుదర్శన్‌రెడ్డి, ఏఈ విజయ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కోవడానికి సిద్ధం

కామారెడ్డి అర్బన్: భారీ వర్షాలు కురిసినప్పుడు ఎదురయ్యే పరిస్థితులు, విపత్తులను ఎదుర్కొని చక్కదిద్దడానికి తమ సిబ్బంది సిద్ధంగా ఉన్నారని విద్యుత్ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు అత్యవసర పరిస్థితుల్లో 1912తో పాటు 87124 81946 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



ఎల్లారెడ్డిలోని ఎస్సీ గురుకులంలో కూరగాయలు కోస్తున్న తాత్కాలిక సిబ్బంది

గురుకులాలపై సమ్మెపోటు

గురుకుల పాఠశాలలు, కళాశాలలకు కూరగాయలు, పండ్లు, మటన్, చికెన్, గుడ్లు, ఇతర సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లు సమ్మెబాట పట్టారు. దీంతో బుధవారం నుంచి సరుకుల సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు భోజనం అందించేందుకు ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ ఇబ్బందిపడుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- నరుకుల కాంట్రాక్టుల్లో కొత్త నిబంధనలపై సరఫరాదారుల నిరసన
- టెండర్లలో పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్
- జిల్లాలో నిలిచిపోయిన సరుకుల సరఫరా

జిల్లాలో వివిధ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నడిచే 34 గురుకులాల్లో దాదాపు 2,350 మంది విద్యార్థులు చదువుతున్నారు. మెనూ ప్రకారం వారికి భోజనం పెట్టేందుకు అవసరమైన అన్ని వస్తువులను కాంట్రాక్టర్లు సరఫరా చేస్తుంటారు. నిత్యావసరాలను ముందుగా సరఫరా చేసినా.. కూరగాయలు, పండ్లు, మాంసం, చికెన్, కోడిగుడ్లు దాదాపు అదేరోజు సరఫరా చేయాల్సి ఉంటుంది.

అయితే ఆయా సరుకులు సరఫరా చేసేవారంతా సమ్మెకు వెళ్లడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. చాలా పాఠశాలల్లో నిల్వలు లేక పాఠశాలల నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు వంట ఏజెన్సీలు కూడా సమ్మెబాట పట్టాయి. చాలా స్కూళ్లలో సాధ్యమైనంత వరకు ఏ రోజుకు ఆ రోజు సరఫరా చేస్తుంటారు. కొన్నింటిని నాలుగైదు రోజులకు సరిపడా సరఫరా చేస్తారు. సరుకు సరఫరాదారులంతా సమ్మెబాట పట్టడంతో సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోంది. బుధవారం విద్యార్థులకు మెనూ ప్రకారం మటన్, చికెన్ కర్రీ వండాల్సి ఉంటుంది. అయితే సంబంధిత కాంట్రాక్టర్లు మాంసం, చికెన్ సరఫరా చేయకపోవడంతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టలేకపోయారు. ఈ విషయంలో కొన్ని స్కూళ్లలో సరఫరాదారులకు నోటీసులు జారీ చేశారు.

కొత్త నిబంధనలకు వ్యతిరేకంగా..

గురుకులాలకు సంబంధించి వంట సామగ్రి, కూరగాయలు, పండ్లు, మాంసం వంటివి సరఫరా చేయడానికి ప్రభుత్వం కొత్త విధివిధానాలను రూపొందించింది. మండలం/జిల్లా యూనిట్‌గా టెండర్లు ఆహ్వానించింది. వీటిని పొందాలంటే రూ. కోట్లల్లో పెట్టుబడి అవసరం అవుతుంది. దానికి తోడు జీఎస్టీ లైసెన్స్ కలిగి ఉండాలనడం, ఇతర నిబంధనలు పాటించాలంటే ప్రస్తుతం సరఫరా చేస్తున్న వారిలో ఏ ఒక్కరికీ అవకాశం దక్కదు. ప్రస్తుతం సరుకులు సరఫరా చేస్తున్న వారంతా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేవారు కావడం వల్ల అంత పెద్ద మొత్తంలో పెట్టుబడి సమకూర్చే పరిస్థితి లేదు. దీంతో వారంతా టెండర్లకు దూరం కావాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పాత పద్ధతిలోనే సరుకుల టెండర్లు పిలవాలని వారు డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టారు.

మెనూ అమలు కష్టమే..

మాంసం, కూరగాయలు, పండ్లు, ఇతర సామగ్రి సరఫరా నిలిచిపోవడంతో మెనూ అమలు జరగడం కష్టంగా మారింది. మెనూలో రోజుకో రకమైన భోజనం ఉంటుంది. వారంలో రెండు రోజులు మాంసంతో కూడిన భోజనం పెట్టాలి. మాంసం సరఫరా నిలిపివేయడం వల్ల విద్యార్థులకు మాంసాహారంతో కూడిన భోజనం అందే పరిస్థితి లేదు. విద్యార్థులకు సరిపడా మాంసం అప్పటికప్పుడు తీసుకురావడం సాధ్యమయ్యే పనికూడా కాదు. వంట ఏజెన్సీలు కూడా సమ్మెలోకి వెళ్లడంతో విద్యార్థులకు భోజనం అందించడం కష్టసాధ్యంగా మారే అవకాశాలున్నాయి.

తాత్కాలిక సిబ్బందితో వంట

ఎల్లారెడ్డిరూరల్: గురుకులాలకు సరుకులు సరఫరా చేసేవారితోపాటు వంట చేసేవారు సమ్మె బాట పట్టడంతో విద్యార్థులు ఇబ్బంది పడకుండా ప్రిన్సిపాల్స్ చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం తాత్కాలిక సిబ్బందితో వంట చేయించారు.

జడివాన జాడేది?

- జిల్లా అంతటా చిరుజల్లులే తప్ప భారీ వర్షాల్లేవ్
- ఇప్పటికీ ఎనిమిది మండలాల్లో లోటు వర్షపాతమే..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రాష్ట్రమంతటా తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని, అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. కానీ జిల్లాలో జడివాన జాడలేదు. జిల్లావ్యాప్తంగా చిరు జల్లులు కురిశాయే తప్ప ఎక్కడా భారీ వర్షాలు రికార్డు కాలేదు. జిల్లాలో ఇప్పటికీ సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. ఎనిమిది మండలాల్లో లోటు వర్షపాతమే ఉంది. పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్, బిచ్కుంద, మద్నూర్, జుక్కల్, ఎల్లారెడ్డి, బీబీపేట మండలాలలో భారీ లోటు వర్షపాతం ఉంది. ఆగస్టు నెలలో ఈరోజు వరకు సాధారణ వర్షపాతం 113.7 మి.మీ. నమోదు కావాల్సి ఉండగా 86.5 మి.మీ. మాత్రమే వర్షం పడింది. అంటే సాధారణంకన్నా 23 శాతం లోటు వర్షపాతం ఉంది. సీజన్ ఆరంభమైన నాటి నుంచి నేటి వరకు 502.7 మి.మీ. కురవాల్సి ఉండగా 464.2 మి.మీ. నమోదైంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురవగా.. చాలా చోట్ల భారీ వర్షాలు కురవలేదు. వాగుల్లో ప్రవాహం మొదలైనా ఉధృతంగా ఒకటి రెండు రోజులు కూడా ప్రవహించిన దాఖలాలు లేవు. ఓ వైపు తెలంగాణలోని పలు జిల్లాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతుండగా.. కామారెడ్డి జిల్లాలో మాత్రం ఆ ఛాయలు కనిపించడం లేదు. అప్పుడప్పుడు ముసురు పెడుతుందే తప్ప భారీ వర్షం మాత్రం కురవడం లేదు. దీంతో అన్నదాతలు నిరాశ చెందుతున్నారు.



నిండు కుండలా ఉన్న కల్యాణి ప్రాజెక్టు

కల్యాణి ప్రాజెక్టులోకి 210 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ఎల్లారెడ్డిరూరల్: తిమ్మారెడ్డి గ్రామ శివారులోని కల్యాణి ప్రాజెక్టులోకి బుధవారం 210 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఈ నీటిని నిజాంసాగర్ మెయిన్ కెనాల్‌లోకి మళ్లిస్తున్నామన్నారు.

సింగూరు ప్రాజెక్టు గేటు ఎత్తివేత

నిజాంసాగర్: ఎగువన వర్షాలు దంచి కొట్టడంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకుంటున్నాయి. బుధవారం సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు 11 వ నంబర్ గేటును ఎత్తి, 7,694 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ఈ నీరు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వచ్చి చేరనుంది.

'సాగర్'లోకి 16 వందల క్యూసెక్కులు..

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. బుధవారం సాయంత్రానికి 1,300.93 అడుగుల (5.67 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

'డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం'

కామారెడ్డి క్రైం: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేయాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌లలో సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు. కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, వాటి దుష్ప్రభావాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతంగా అవగాహన కల్పించే ఉద్దేశంతో నషా ముక్త్ భారత్ అభియాన్ అమలు చేస్తున్నాయన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు చేపడుతున్న ఈ కార్యక్రమం ఐదో వార్షికోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలను రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మాదక ద్రవ్యాలను ఎవరైనా సరఫరా చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి, సీఐలు నరహరి, శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

సాధారణ కాన్పులే అధికం

- బాన్సువాడ ఎంసీహెచ్‌లో సగానికిపైగా నార్మల్ డెలివరీలే

బాన్సువాడ : కడుపు కోతలను నివారించి, సాధారణ ప్రసవాలను పెంచడమే లక్ష్యంగా బాన్సువాడ మాతాశిశు సంరక్షణ ఆస్పత్రి వైద్యులు కృషి చేస్తున్నారు. గర్భిణులకు అవగాహన కల్పిస్తూ నార్మల్ డెలివరీలు చేస్తున్నారు.

బాన్సువాడ, జుక్కల్, నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గాలతో పాటు సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు బాన్సువాడలో మాతాశిశు సంరక్షణ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ఆస్పత్రి ప్రారంభించినప్పటి నుంచి ఇక్కడ సాధారణ కాన్పులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. రోజు నాలుగైదు కాన్పులు చేస్తున్నారు. ఇక్కడి వైద్యులు గర్భిణులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి సాధారణ కాన్పులకే మొగ్గు చూపేలా ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఆస్పత్రిలో సగానికిపైగా సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయి. అవసరం అయితేనే సిజేరియన్ చేస్తున్నారు.



బాన్సువాడ మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి

అవగాహన కల్పిస్తున్నాం



సాధారణ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నాం. దీంతో బాన్సువాడ మాతాశిశు సంరక్షణ ఆస్పత్రిలో ఎక్కువగా సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయి.

– విజయలక్ష్మి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, బాన్సువాడ

ఎంసీహెచ్‌లో నమోదైన ప్రసవాలు..

నెల	సిజేరియన్	నార్మల్
జనవరి	125	169
ఫిబ్రవరి	97	139
మార్చి	118	165
ఏప్రిల్	163	163
మే	147	157
జూన్	168	155
జూలై	162	183
మొత్తం	980	1,131

స్వయం ఉపాధితో రాణింపు

- ఆర్థిక స్వావలంబన సాధిస్తున్న సులోచన
- స్వాతంత్ర్య దినోత్సవాలకు ప్రత్యేక అతిథిగా ఎంపికైన 'లఖ్‌పతి దీదీ'

లింగంపేట: మహిళా సంఘం సభ్యురాలిగా చేరి పొదుపు చేస్తూ, బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుంటూ స్వయం ఉపాధితో ముందుకు సాగిన మోతెకు చెందిన సులోచన.. దేశ రాజధానిలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవాలకు ప్రత్యేక అతిథిగా ఎంపికయ్యారు. లఖ్‌పతి దీదీగా ఆ వేడుకలలో పాల్గొనబోతున్నారు. ఈ అవకాశం వచ్చినందుకు ఆమె ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇరవై ఏళ్ల క్రితం సంఘంలో చేరిక

మోతె గ్రామంలో 20 ఏళ్ల క్రితం ఓం సాయి మహిళా సంఘంలో సులోచన సభ్యులుగా చేరారు. ఆమె చొరవతో మోతె మహిళా పరస్పర సహాయ సహకార పొదుపు, పరపతి గ్రామ సంఘం ఏర్పాటు చేసుకున్నారు. మహిళా సంఘంలో సాధారణ సభ్యురాలిగా చేరిన సులోచన.. ప్రతి నెల చిన్న మొత్తంలో పొదుపు జమ చేయడంతోపాటు స్వయం ఉపాధి కోసం సంఘం నుంచి రుణం తీసుకున్నారు. అలాగే సంఘ సభ్యులతో కలిసి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు పొందారు. వాటిని తొలుత వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడులకు వినియోగించారు.



పిండి గిర్నీ నిర్వహిస్తున్న సులోచన

తర్వాతి కాలంలో పిండి గిర్ని ఏర్పాటు చేసుకున్నారు. కూరగాయలు, పూలు తదితర పంటలు పండిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

అందరి సహకారంతోనే..

లఖ్‌పతి దీదీ కేటగిరిలో దేశ స్వాతంత్ర్య దినోత్సవాలకు ఎంపికవడంపై సులోచన హర్షం వ్యక్తం చేశారు. మహిళా సంఘంలోని తోటి సభ్యులతోపాటు గ్రామ, మండల, జిల్లా సమాఖ్య సభ్యులు, ఐకేపీ అధికారుల సహకారంతోనే రాణిస్తున్నానన్నారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డీఆర్‌డీవో సురేందర్, ఏపీఎం వినోద్‌కుమార్, సీసీ రాజారెడ్డి ప్రోత్సాహంతో మహిళా సంఘాల సభ్యులం ఆర్థిక స్వావలంబన దిశగా సాగుతున్నామని పేర్కొన్నారు.

నాయకత్వ లక్షణాలతో ముందుకు..

మొదట మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరిన సులోచన.. తర్వాత సంఘానికి నాయకురాలు అయ్యారు. గ్రామ సంఘాలకు అధ్యక్షురాలిగా, మండల సమాఖ్య అధ్యక్షురాలిగా, జిల్లా సమాఖ్య పాలకవర్గ సభ్యురాలిగా సేవలు అందించారు. అలాగే గ్రామ సంఘాల ఆదాయం పెంచడానికి వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాన్ని గ్రామస్తుల సహకారంతో విజయవంతంగా నడిపించారు. ఇలా మహిళా సంఘం సభ్యురాలిగా రాణిస్తూ, స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధిస్తున్న మహిళలను గౌరవించడం కోసం కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవాలకు ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించింది. లఖ్‌పతి దీదీ కేటగిరిలో పలువురిని ఎంపిక చేసి ఆహ్వానాలు పంపింది. రాష్ట్రంలో ఐదుగురికి ఆహ్వానం రాగా.. అందులో లింగంపేట మండలం మోతెకు చెందిన సులోచన ఒకరు. ఈనెల 15న ఢిల్లీలో నిర్వహించే వేడుకలలో ఆమె పాల్గొననున్నారు.

డ్రెయినేజీలను శుభ్రం చేయించండి

- మురుగునీరు రోడ్లపైకి రాకుండా చూడండి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో బుధవారం ఆయన పర్యటించారు. మురికి కాలువలు, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో కాలనీల్లో ఎక్కడా మురికి కాలువలు మూసుకుపోకుండా చూడాలన్నారు. అటంకం లేకుండా మురికి నీరు ప్రవహించేలా శుభ్రం చేయించాలన్నారు. మురుగు నీరు రోడ్ల మీదికి, ఇళ్లలోకి రాకుండా ముందస్తుగా అన్ని డ్రెయినేజీలను వెంటనే శుభ్రం చేయించాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. క్రమం తప్పకుండా వాహనాల ద్వారా చెత్త సేకరణ జరగాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలని, ఫాగింగ్ చేయించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు పరికరాలను అందజేశారు. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా పనిచేసే కార్మికులకు రెయిన్ కోట్స్, అత్యవసర సామగ్రిని అందజేయడానికి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే అందజేయాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, తహసీల్దార్ జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యానగర్ కాలనీలో డ్రెయినేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కామారెడ్డి క్రైం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కేంద్ర ప్రభుత్వం నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రారంభించి ఐదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాలతో కలిగే దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది యువకులు గంజాయి, కల్తీ కల్లు, మద్యం, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని కట్టడి చేయడానికి జిల్లా సంక్షేమ శాఖ, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

పొడిగింపా.. ప్రత్యేకాధికారుల పాలనా?

- నేటితో ముగియనున్న సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం
- స్పష్టత ఇవ్వని సర్కారు

నాగిరెడ్డిపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలక వర్గాల పదవీకాలం గురువారంతో ముగియనుంది. అయితే పాలకవర్గాల గడువు మరోమారు పొడిగిస్తారా లేక ప్రత్యేకాధికారులను నియమిస్తారా అన్న విషయమై ఇంకా స్పష్టత రాలేదు.

జిల్లాలో మొత్తం 55 సహకార సంఘాలున్నాయి. వీటిలో 1.55 లక్షల మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 2019 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పాలకవర్గాల పదవీ కాలాన్ని ఆరు నెలలపాటు పొడిగించారు. ఆ గడువు కూడా ఈనెల 14తో పూర్తికానుంది. ఈ నేపథ్యంలో సహకార సంఘాల పాలక వర్గాలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఉత్కంఠ నెలకొంది. పదవీ కాలం ముగుస్తుండడం, గడువు పొడిగింపుపై ఎలాంటి ప్రకటన రాకపోవడంతో స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎవరు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారన్న అంశంపై చర్చ నడుస్తోంది.



మాల్తుమ్మెద సహకార సంఘ కార్యాలయం

ఎలాంటి సమాచారం లేదు..

సహకార సంఘాల పాలక వర్గాల పదవీకాలం గురువారంతో ముగియనుంది. పాలకవర్గాల గడువు పొడిగిస్తారా, లేదా అన్నది ప్రభుత్వ పరిధిలోని అంశం. దీనిపై ఇంకా ఎలాంటి సమాచారం లేదు.

– రామ్మోహన్, డీసీవో, కామారెడ్డి

క్లుప్తంగా

'సుకన్య సమృద్ధి యోజన' సద్వినియోగం చేసుకోవాలి



ఎల్లారెడ్డిరూరల్: అటల్ పెన్షన్, సుకన్య సమృద్ధి యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంకు సిబ్బందితో పాటు సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫరేషన్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని మల్లయ్యపల్లి గ్రామంలో ప్రజలకు పోస్టాఫీసు ద్వారా చేకూరుతున్న ప్రయోజనాలను వివరించారు. జీపీ కార్యదర్శి రాజయ్య, గ్రామస్తులు తదితరులున్నారు.

16న గోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

ఎల్లారెడ్డి: పట్టణంలోని గోపాల స్వామి ఆలయంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు విశ్వ హిందూ పరిషత్ ఎల్లారెడ్డి ప్రఖండ అధ్యక్షులు సాతెల్లి నవీన్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయంలో యజ్ఞం,గోపూజ,ప్రముఖ వక్తల సందేశం, అనంతరం గోపాల కాలువ (ఉట్టి కొట్టడం) కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఫిజియో థెరపీతో సత్ఫలితాలు

బాన్సువాడ రూరల్: శారీరక వికలాంగులైన విద్యార్థులకు ప్రతిరోజు ఫిజియోథెరఫీ చేయడంతో సత్ఫలితాలు వస్తాయని బాన్సువాడ మండల విద్యాధికారి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం బాన్సువాడలోని భవిత కేంద్రంలో నిర్వహించిన ఫిజియో థెరపి శిబిరాన్ని సందర్శించారు. ప్రతివారం భవిత కేంద్రంలో నిర్వహించే ఫిజియో థెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫిజియోథెరపిస్టు డా. గంగాధర్, ఐఈఆర్‌పీ వెంకటపద్మ, అనిల్, సిబ్బంది ఉన్నారు.

20 వరకు ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు అవకాశం

నిజామాబాద్ అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓ పెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవే శాలకు ఈ నెల 20వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఎస్సీ, పీజీలో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నా రు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ధ్రువపత్రాలను స్టడీ సెంటర్‌లో సమర్పించాలన్నారు.

పక్కాగా టీచర్ల హాజరు

- పాఠశాలల్లో ప్రారంభమైన ఎఫ్ఆర్ఎస్ విధానం
- ఉపాధ్యాయుల డుమ్మాలు, ఆలస్యానికి చెక్
- ఉత్తమ బోధనే లక్ష్యం
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

సదాశివనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల డుమ్మాలు, ఆలస్యానికి చెక్ పెడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్(ఫేస్ రికగ్నైజేషన్ అటెండెన్స్ విధానం)కు శ్రీకారం చుట్టింది. ఈవిధానం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆగస్టు 1న ప్రారంభమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఈఫేస్ రికగ్నేషన్ కార్యక్రమం ఇప్పటికే కొనసాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదన్న ఫిర్యాదులు రావడం, చాలా చోట్ల ఉపాధ్యాయులు పని చేస్తున్నచోట నివాసం ఉండకుండా దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తు పాఠశాలలకు సమయానికి చేరుకోకపోవడం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పరస్పరం సహకరించుకుంటు విధులకు హాజరు కాకున్నా మరుసటి రోజు రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్నారనే ఆరోపణలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈవిధానాన్ని ప్రవేశ పెట్టింది. ప్రత్యేకంగా ఉపాధ్యాయుల హాజరుశాతంపై దృష్టి పెట్టింది. జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో ఉద్యోగులు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించే విధంగా, హాజరును వారే నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా యాప్‌ను తీసుకొచ్చింది.



ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ఇలా...

జిల్లా వ్యాప్తంగా 191 ఉన్నత పాఠశాలలు, 06 ఆదర్శ పాఠశాలలు, 698 ప్రాథమిక పాఠశాలలు, 124 ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. బోధనేతర సిబ్బందికి కూడా ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఉద్యోగుల సమయ పాలనకు కొత్తగా ప్రవేశపెట్టిన టీజీఎఫ్ఆర్ఎస్ యాప్‌ను సంబంధిత ఉద్యోగి స్మార్ట్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేస్తారు. మొదటగా ఉద్యోగి వివరాలతో రిజిస్టర్ చేసుకొని లాగిన్ కావాలి. యాప్ ఇన్‌స్టాలేషన్ సమయంలోనే సంబంధిత కార్యాలయం, పాఠశాల ఆవరణ లాంగిట్యూడ్, లాటిట్యూడ్‌లను టెక్నీషియన్ అప్‌లోడ్ చేస్తారు. ఒకసారి లాగిన్ అయిన తర్వాత యాప్‌ను నిరంతరంగా వినియోగించవచ్చు. ఉద్యోగి ఉదయం నిర్దేశిత సమయానికి కార్యాలయంలోకి వచ్చిన తరువాత యాప్‌ను ఓపెన్ చేసి క్లాక్ ఇన్ అనే ఆప్షన్‌పై నొక్కితే సదరు ఉద్యోగి వచ్చిన సమయం ఆన్‌లైన్‌లో సంబంధిత పర్యవేక్షణ అధికారికి చేరుతుంది. ఆఫీసులో పని సమయం ముగిసిన తర్వాత క్లాక్‌ఔట్ అని ఆప్షన్‌పై టచ్ చేస్తే ఉద్యోగి కార్యాలయాన్ని విడిచి వెళ్లే సమయాన్ని, పని చేసిన గంటలను లెక్కించి తిరిగి సంబంధిత పర్యవేక్షణ అధికారికి ఆన్‌లైన్‌లో చేరుతుంది.

ఉత్తమ ఫలితాలు వస్తాయి



ఫేస్ రికగ్నైజేషన్ విధానంతో ఉత్తమ ఫలితాలు వస్తాయి. ప్రధానంగా ఈవిధానంలో సాంకేతిక సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఉపాధ్యాయుల డుమ్మాలు, ఆలస్యానికి చెక్ పెట్టినట్లు అవుతోంది. ఎంఈవో తనిఖీలు ఎక్కువగా ఉండవు. ఈ విధానం బాగుంది.

– గాధారి రాజిరెడ్డి, పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు,సదాశివనగర్

ఉద్యోగులు సమయపాలన పాటిస్తారు



ఈ విధానం మొదటగా విద్యార్థులకు అమలు చేస్తున్నారు. అలాగే ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు కూడా ప్రవేశ పెట్టడంతో సమయపాలన పాటిస్తారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, కార్యాలయాల్లో ఈవిధానాన్ని వర్తింప జేయాలి. బోధన, బోధనేతర సిబ్బందికి కూడా ఈ విధానం అమలు చేయడం మంచి నిర్ణయం.

– చింతల లింగం, టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు,కామారెడ్డి

మంజూరు 99.. ప్రారంభం 12

- ఇందిరమ్మ ఇళ్ల పైలట్ గ్రామం హాస్నపూర్‌లో పరిస్థితి
- పిట్లం మండలంలో ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాని లబ్ధిదారులు

పిట్లం(జుక్కల్): పేదలకు ఇళ్లు ఇవ్వాలన్న ఉదేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశ పెట్టింది. ఈ పథకంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే వారికి విడతల వారీగా మొత్తం రూ. 5 లక్షలు అందజేస్తుంది. పిట్లం మండలంలో ఇళ్ల నిర్మాణాకి ముందుకు రావడం లేదు. మండలంలోని హాస్నపూర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి 99 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 12 మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించగా, అందులో ఆరుగురు మాత్రమే చురుకుగా పనులు చేసుకోవడంతో వారికి మొదటి విడత రూ.లక్ష చొప్పున బిల్లులు అందజేశారు. ఇందులో 49 మంది లబ్ధిదారులు పంటలు వచ్చాక, కొంత మంది, దసర, దీపావళి పండుగల తర్వాత నిర్మాణాలు సుముఖంగా ఉన్నారు. మిగిలిన 38 మంది ఇళ్ల వద్దని రాతపూర్వకంగా రాసి ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. పిట్లం మండలంలో 423 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి. అందులో 138 మంది లబ్ధిదారులు కట్టుకుంటామని ముందుకు వచ్చి ముగ్గు పోశారు. అందులో 50 మంది లబ్ధిదారులు చురుకుగా పనులు చేసుకొవడంతో వారికి మొదటి విడత రూ. లక్ష చొప్పున బిల్లులు అందజేశారు. మిగితా 285 మంది లబ్ధిదారులు ఇంకా పనులు ప్రారంభించలేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తే ఇళ్ల నిర్మాణంలో వేగం పెరిగే అవకాశం ఉంది.



హాస్నపూర్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు

ఇళ్లు నిర్మించుకోవాలి

ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించుకోవాలని సూచిస్తున్నాం. ఇళ్లు కట్టుకునే వారికి విడతల వారీగా బిల్లులు చెల్లిస్తున్నాం. అయిన కొంత మంది లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. కొందరు పంటల తర్వాత, పండగల తర్వాత కట్టుకుంటామని అంటున్నారు.

– రఘు, ఎంపీడీవో, పిట్లం

దరఖాస్తు లేకుండానే కుల ధ్రువీకరణ పత్రం

- నూతన విధానాన్ని అమలులోకి తెచ్చిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు
- అవగాహన కల్పించని అధికారులు



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): కుల ధ్రువీకరణ పత్రాల జారీలో రాష్ట్ర ప్రభుత్వం పలు మార్పులు చేసింది. మీసేవ నుంచి పత్రాన్ని పొందిన వ్యక్తి మరోసారి దరఖాస్తు చేసే వెసులుబాటు గతంలో ఉండేది. కులం మారదు కనుక ఇప్పుడు అలాంటి విధానానికి స్వస్తి పలకడంతోపాటు ప్రభుత్వం నూతన విధానాన్ని అమలులోకి తెచ్చింది. కుల ధ్రువీకరణపత్రం గతంలో 'కమ్యూనిటీ డేట్ ఆఫ్ బర్త్' గా వచ్చేది. దీంతోపాటు ఆధార్ కార్డు ప్రకారం పుట్టిన తేదీ వివరాలు వచ్చేవి. ప్రస్తుతం కుల ధ్రువీకరణ పత్రంలో జనన వివరాలు అవసరం లేదని ప్రభుత్వం గుర్తించింది. పత్రంలో ఈ వివరాలను తొలగించి కేవలం 'కమ్యూనిటీ' పేరుతోనే నూతన పత్రాన్ని జారీ చేస్తోంది. కొత్త విధానంతో ధ్రువపత్రాలు పొందడానికి క్షణాల్లో పని పూర్తయితే బాగానే ఉంటుంది. కానీ, గతంలో పొందిన కుల ధ్రువపత్రాల్లో ఏవైనా తప్పులు ఉంటే వాటిని మార్చుకునే వెసులుబాటు లేదు.

ఎస్సీ వర్గానికి వర్తించదు..

కుల ధ్రువీకరణ పత్రం జారీలో అన్ని సామాజిక వర్గాలకు పాత ధ్రువపత్రం చూపిస్తే అప్పటికప్పుడు కుల ధ్రువీకరణ పత్రం జారీ కానుండగా ఎస్సీ సామాజిక వర్గానికి మాత్రం వర్తించదని అధికారులు చెబుతున్నారు. వారు కొత్తగా దరఖాస్తు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు.

ప్రచారం కరువు..

నూతన విధానంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అధికార యంత్రాంగం ప్రేక్షకపాత్ర పోషిస్తోంది. నూతన మార్పులను పత్రికా ప్రకటనల ద్వారా ప్రజలకు తెలపాల్సి ఉండగా తదనుగుణ చర్యలు లేకపోవడం గమనార్హం. కొత్త విధానంలో కులధ్రువీకరణ పత్రం ఎలా తీసుకోవాలో తెలియక చాలామంది పాత విధానాన్నే అనుసరిస్తూ సమయంతోపాటు డబ్బు వృథా చేసుకుంటున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను సంప్రదించగా ప్రభుత్వం నుంచి ఇంకా గైడ్‌లైన్స్ రాలేదని రాగానే ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

పాత సర్టిఫికెట్ చూపిస్తే సరి..

ఇక మీదట ప్రతిసారి కుల ధ్రువీకరణ పత్రం పొందడానికి దరఖాస్తు చేయాల్సిన పని లేదు. పాత ధ్రువీకరణ పత్రంలోని నంబర్ లేదా ఆధార్ ద్వారా అప్పటికప్పుడు మీసేవలో సర్టిఫికెట్ తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో విద్యార్థులు, ఇతరత్రా వారికి సేవలు సులభతరం కానున్నాయి. గతంలో మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకొని, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నాయబ్ తహసీల్దార్, తహసీల్దార్ ఆమోదం పొందిన తర్వాత కుల ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి వచ్చేది. ఈ ప్రక్రియకు కనీసం పక్షం రోజులు సమయం పట్టేది. కొత్త విధానంలో భాగంగా పాత సర్టిఫికెట్ చూయించి వెంటనే కొత్త సర్టిఫికెట్ పొందే అవకాశం కల్పించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాచారెడ్డిలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి
- పాల్వంచ, మాచారెడ్డి మండలాల అధికారులతో సమీక్ష

మాచారెడ్డి/పాల్వంచ : ప్రభుత్వ శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం మాచారెడ్డి, పాల్వంచ మండలాల అధికారులతో వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన విజన్ అవినీతిరహిత పాలన అని, దానికి అనుగుణంగా అధికారులు మసలుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తే అధికారులకు రక్షకుడిగా ఉంటానన్నారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడినా ఊరుకోనని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న తరుణంలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్య పనులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చేయించాలన్నారు. అలాగే వైద్య అధికారులు, సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను అనర్హులు కాకుండా అర్హులకే కేటాయించాలని అధికారులకు స్పష్టం చేశారు. సమావేశాల్లో తహసీల్దార్లు సరళ, హిమబిందు, ఎంపీడీవోలు గోపిబాబు, శ్రీనివాస్, ఎస్‌ఐ అనిల్, వైద్యాధికారి ఆదర్శ్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే కాటిపల్లి

రామారెడ్డి: మండలంలోని మద్దికుంట, రెడ్డిపేట గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో చదువు ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, స్టాఫ్ రూంను పరిశీలించారు సమస్యలుంటే తన దృష్టికి తేవాలని విద్యార్థులకు సూచించారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఎల్లారెడ్డిరూరల్/బాన్సువాడ రూరల్/మద్నూర్/నస్రుల్లాబాద్/ సదాశివనగర్ : ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ మాట్లాడారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం విద్యార్థులు పాటుపడాలని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ గులాం ముస్తఫా అన్నారు. రాష్ట్ర యాంటి నార్కోటిక్ బ్యూరో ఆదేశానుసారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,3 ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిరోధక అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది నషాముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు. మద్నూర్ బాలుర గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులతో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి వెంకట్ మాట్లాడుతు మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియశీల భాగస్వామిని అవుతానని పేర్కొన్నారు. బీబీపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో అధ్యాపకులు నషాముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. నస్రుల్లాబాద్ మండలం నెమ్లి జెడ్పీహెచ్ఎస్‌లో సైబర్ నేరాలు, ఫోక్సో కేసుల తదితర వాటిపై షీ టీం కానిస్టేబుల్ అనిల్ కుమార్ అవగాహన కల్పించారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పారా లీగల్ వలంటీర్ మఠం విజయ్ కుమార్ సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఎలా ఉండాలనే విషయాలను తెలియజేసే వాల్ పోస్టర్లను సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్ చేతుల మీదుగా మర్కల్ చౌరస్తా వద్ద ఆవిష్కరించారు. అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడ ఎస్ఆర్ఎన్‌కే కళాశాలలో..



మద్నూర్‌లో ..

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు కృష్ణ అనే వ్యక్తికి బుధవారం రెండ్రోజుల జైలుశిక్ష విధించింది. రెండు రోజుల క్రితం పట్టణ పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా కృష్ణ డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. కోర్టులో హాజరుపర్చగా ద్వితీయశ్రేణి న్యాయమూర్తి చంద్రశేఖర్ రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి తెలిపారు.

తాడ్వాయిలో ఒకరికి..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మండలంలోని ఎర్రాపహాడ్‌కు చెందిన రాజాగౌడ్‌కు కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి చంద్రశేఖర్ రెండ్రోజుల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై మురళి తెలిపారు.

ముప్కాల్ పరిధిలో ఇద్దరికి..

బాల్కొండ: ముప్కాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నిర్మల్ జిల్లా జాఫ్రాపూర్‌కు చెందిన దర్శనం రాజేశ్వర్, తాండ్రాకు చెందిన బదావత్ సాయికిరణ్‌లకు ఆర్మూర్ ద్వితీయ శ్రేణి మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ రెండ్రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు.

సివిల్ ప్రొసీజర్ కోడ్‌లో మెలకువలు నేర్చుకోవాలి

నిజామాబాద్ లీగల్: యువ న్యాయవాదులు సివిల్ ప్రొసీజర్ కోడ్‌పై పట్టు సాధించినప్పుడే సివిల్ లాయర్‌గా వృత్తిలో స్థిరపడతారని జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి పేర్కొన్నారు. యువ న్యాయవాదుల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన శిబిరం రెండోరోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని మెలకువలు నేర్చుకోవాలని సూచించారు.

ఇంజినీరింగ్ కళాశాలలో 61 మంది చేరిక

తెయూ(డిచ్‌పల్లి): నూతనంగా ఏర్పాటైన తెలంగాణ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో 3వ విడత కౌన్సెలింగ్‌లో 81 మందిని కేటాయించగా, బుధవారం సాయంత్రం వరకు 61 మంది విద్యా ర్థులు అడ్మిషన్స్ తీసుకున్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)లో 48 మంది, సీఎస్ ఐటీలో ముగ్గురు, సీఎస్ (ఏఐ)లో ఏడుగురు, డాటా సైన్స్‌లో ముగ్గురు విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి తెలిపారు.



తెయూ ఇంజినీరింగ్ కళాశాలలో అడ్మిషన్ తీసుకుంటున్న విద్యార్థి

హాస్టల్ వసతి లేక వెనుకంజ

ఇంజినీరింగ్ విద్యార్థులకు తెయూ క్యాంపస్‌లో హాస్టల్ వసతి కల్పించడం లేదు. దీంతో కౌన్సెలింగ్‌లో కేటాయించబడిన మరికొంత మంది విద్యార్థులు క్యాంపస్‌కు వచ్చి ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న వసతి, సౌకర్యాలను తెలుసుకున్నారు. హాస్టల్ వసతి లేకపోవడంతో కొందరు బాలికలు ఇక్కడ అడ్మిషన్ తీసుకునేందుకు వెనుకంజ వేశారు. నాలుగు కోర్సులకు 264 సీట్లు అందుబాటులో ఉన్నప్పటికీ కళాశాల మంజూరులో ఆలస్యం కావడం, హాస్టల్ వసతి లేకపోవడంతో విద్యార్థులు తక్కువ సంఖ్యలో చేరడానికి కారణమవుతున్నట్లు తెలుస్తోంది. సీట్ల భర్తీకి ఇక స్పాట్ కౌన్సెలింగ్‌పైనే ఆశలు పెట్టుకోవాల్సి ఉంటుంది.

క్రైం కార్నర్

మట్టిలో కూరుకుపోయి కూలీ మృతి



సురాజ్ నిశాద్(ఫైల్)

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44 విస్తరణ పనుల్లో బిహార్‌కు చెందిన సురాజ్ నిశాద్(40) అనే కూలీ మట్టిలో కూరుకుపోయి మృతి చెందాడు. ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం .. బిహార్ రాష్ట్రానికి చెందిన కొంతమంది కూలీలు ఓ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నారు. మంగళవారం ముప్కాల్ మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు విస్తరణలో పని చేసేందుకు సునీల్, సురాజ్, ధీరేంద్రయాదవ్, రాజు వచ్చారు. పనిలో భాగంగా పైపులను పక్కకు జరిపేందుకు సురాజ్, ధీరేంద్రయాదవ్‌లు గుంతలోకి దిగారు. ప్రమాదవశాత్తు పైపులైన్ పక్కన ఉన్న మట్టి పెళ్లాలు కూలి సురాజ్ పూర్తిగా కూరుకుపోగా, ధీరేంద్రయాదవ్ ఛాతి వరకు మట్టి పడింది. ఇద్దరినీ హైవే అంబులెన్స్‌లో ఆర్మూర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే సురాజ్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, ధీరేంద్రయాదవ్ చికిత్స పొందుతున్నాడు.

చికిత్స పొందుతూ కేజీబీవీ విద్యార్థిని మృతి



కావేరి (ఫైల్)

నిజామాబాద్‌నాగారం/ఆర్మూర్: తీవ్రగాయాలతో ప్రగతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేజీబీవీ విద్యార్థిని కావేరి(16) బుధవారం ఉదయం మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని దుబ్బకు చెందిన కావేరి ఆర్మూర్ పట్టణం పెర్కిట్‌లో ఉన్న కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 5న అర్ధరాత్రి కేజీబీవీ భవనం నుంచి కావేరి కిందకు దూకింది. తలకు తీవ్రగాయాలు కావడంతో కేకలు వేసింది. స్పందించిన కేజీబీవీ సిబ్బంది వెంటనే స్థానికంగా ఉన్న ఎంజే ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ప్రగతి ఆస్పత్రికి తరలించారు. వారం రోజులుగా చికిత్స పొందిన కావేరి బుధవారం ఉదయం 8.40 నిమిషాల సమయంలో మరణించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

కోతులకు భయపడే..

కావేరి ఈ నెల 5న తెల్లవారుజామున హాస్టల్‌లోని వాష్‌రూంకు వెళ్లి వస్తుండగా కోతులు వెంటపడడంతో భయపడి హాస్టల్ పోర్టువాల్ ఎక్కి కిందకు దూకినట్లు కేజీబీవీ అధికారులు తెలిపారు. తలకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కాగా, కావేరి తండ్రి గణేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్మూర్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

రామారెడ్డి: ఆర్థిక ఇబ్బందులతో గడ్డి మందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు రామారెడ్డి ఎస్సై లావణ్య తెలిపారు. రామారెడ్డికి చెందిన పోగుల నాగరాజు (37) కొంతకాలంగా మద్యం, పేకాటకు బానిసయ్యాడు. దురలవాట్లతో అప్పులు కావడంతో మానసిక ఒత్తిడికి గురై ఈ నెల 1న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. 9న గుర్తుతెలియని గడ్డి మందు తాగిన నాగరాజును కుటుంబసభ్యులు గుర్తించారు. వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

నవీపేట: మండల కేంద్రంలోని బాసర చౌరస్తా సమీపంలో ఇరిగేషన్ కాలువ స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టినట్లు ఇరిగేషన్ ఏఈ శ్రీధర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారుల అనుమతి లేకుండా ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన రజక సంఘం ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని కోరారు.


వృద్ధురాలిపై కోతుల దాడి

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన చాకలి గున్నాయి అనే వృద్ధురాలిపై బుధవారం కోతులు దాడిచేశాయి. గున్నాయి రోడ్డు వెంబడి వెళ్తుండగా ఒక్కసారి కోతులు దాడిచేసి తొడ భాగంలో గాయపరిచాయి. స్థానికులు వెంటనే ఆమెను స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు.

ఐదుగురికి జైలు.. 15 మందికి జరిమానా

ఖలీల్‌వాడి: మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలు శిక్ష పడినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 20 మందికి నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. అనంతరం సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపరచగా 15 మందికి రూ. 28వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత




పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని హస్గుల్ క్వారీ నుంచి మంగళవారం రాత్రి సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం తడ్కల్ గ్రామానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సముందర్ తండా శివారులో పోలీసులు పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు.అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై అరుణ్ కుమార్ హెచ్చరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



తాడ్వాయి (ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని కరడ్‌పల్లి గ్రామంలో బుధవారం పట్టపగలు తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన పరువాజిగారి శివాజీరావు కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి పెళ్లి నిమిత్తం ఇతర గ్రామానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి చొరబడ్డారు. అనంతరం బీరువా తాళాలు పగులగొట్టి అందులో ఉన్న రెండుతులాల బంగారం, రూ.40వేల నగదు, వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళి తెలిపారు.

అదుపుతప్పిన కంటైనర్



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామశివారు 44వ జాతీయ రహదారిపై కంటైనర్ అదుపుతప్పింది. బుధవారం తెల్లవారుజామున నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కంటైనర్ అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఘటనలో డ్రైవర్, క్లీనర్‌లు సురక్షితంగా బయటపడ్డారు. సదాశివనగర్ పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.